ప్రజాశక్తి
మంగళవారం 26 సెప్టెంబర్ 2023

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 26 నుంచి అనకాపల్లి ఏఎంఎల్ కళాశాలలో జరగనున్న ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి ఆటల పోటీల్లో స్థానిక డుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అనకాపల్లిలో జరిగే పోటీలకు తరలి వెళ్లినట్లు చెప్పారు.

క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రభుత్వ రంగ సంస్థల రక్షణతోనే సామాజిక న్యాయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, రమాదేవి
-అల్లూరి జిల్లాలో ఉత్సాహంగా ఉక్కు రక్షణ యాత్ర
-ఎక్కడికక్కడ జన నీరాజనం

ప్రజాశక్తి - అరకులోయ, అనంతగిరి విలేకరులు

ప్రభుత్వ రంగ సంస్థల రక్షణతోనే సామాజిక న్యాయం సాధ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, డి.రమాదేవి అన్నారు. సిపిఎం ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో కొనసాగుతున్న ఉక్కు రక్షణ బైకు యాత్ర సోమవారం విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి ప్రవేశించింది. యాత్ర బృందానికి ఎక్కడికక్కడ ఘన స్వాగతం లభించింది. నాయకుల ప్రసంగాలు జనంలో చైతన్యం నింపాయి. ఉక్కు పోరుకు వారిని సన్నద్ధం చేశాయి.

జిల్లాలోని ఏజెన్సీ ముఖద్వారంగా పేర్కొనే అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయతీ వెంకయ్యపాలెం వద్ద యాత్ర బృందానికి గిరిజన మహిళలు ఎదురేగి సంప్రదాయబద్ధంగా తిలకందిద్ది, పూల దండలు వేసి తమ వాడల్లోకి ఆహ్వానించారు. అక్కడి నుంచి బైకు యాత్ర కాశీపట్నం, శివలింగపురం, డముకు, బొర్రా జంక్షన్ మీదుగా అనంతగిరి మండల కేంద్రానికి చేరింది. జూనియర్ కళాశాల ఆవరణలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, డి.రమాదేవి, అనంతగిరి జెడ్పిటిసి సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉక్కు కర్మాగారం పరిరక్షణ విషయంలో వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. మోడీ సర్కారుకు వత్తాసు పలికే ధోరణినే ప్రదర్శిస్తోందని తెలిపారు. టిడిపి, జనసేన పార్టీలు మౌనం వీడి పోరాటంలోకి రావాలన్నారు. త్యాగాలతో ఏర్పడ్డ ఉక్కును ఐక్యపోరాటాలతో కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, తదితరులు పాల్గొన్నారు. అక్కడ నుంచి బీసుపురం మీదుగా అరకులోయలోకి యాత్ర ప్రవేశించింది. అరకులోయ మండలంలోని సుంకరమెట్టలో గిరిజనులు, సిపిఎం మహిళా నాయకులు సాదర స్వాగతం పలికారు. పాదయాత్ర రథసారథి కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర సహా యాత్ర బృందం సభ్యులకు పూలదండలు వేసి తిలకం దిద్ది హారతులిచ్చారు.

అనంతగిరిలో లోకనాథంకు తిలకం దిద్దుతున్న మహిళలు

అరుకులోయలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, చిత్రంలో రమాదేవి

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి..? : లోకనాథం

అనంతరం అరకులోయలోని దండకారణ్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో లోకనాథం మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎలా మోసం చేసిందో వివరించారు. అదానీ, అంబానీల ప్రయోజనాలే మోడీ సర్కారుకు ముఖ్యమా ? అని ప్రశ్నించారు. గిరిజనులకు వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని రద్దు చేయడం దారుణమన్నారు. గిరిజన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. గిరిజన చట్టాలకు మోడీ సర్కారు ఎలా తూట్లు పొడుస్తోందో వివరించారు. పచ్చని పంట పొలాల్లో గ్రీన్ ఎమర్జెన్సీ పేరుతో సోలార్ సిస్టం తెస్తున్నారని, దానివల్ల ఏజెన్సీ వాసులకు ఎటువంటి లాభమూ ఉండదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 120 గ్రామాలకు నేటికీ విద్యుత్ సౌకర్యం లేదన్నారు. మెరుగైన జీవితం రావాలంటే ప్రభుత్వ రంగ సమస్యలను పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు. పబ్లిక్ సెక్టార్‌లోనే రిజర్వేషన్ల అమలు సాధ్యమని తెలిపారు.

పోరాటంలో మహిళలు అగ్రభాగాన ఉండాలి : రమాదేవి

పోరాటంలో మహిళలు ముందుండి ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోడీ సర్కారు చేస్తున్న కుట్రలను వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ గొంతును బిజెపి ప్రభుత్వం ఎలా నొక్కేసిందో వివరించారు. రైల్వేను ప్రైవేటుకు అప్పగించడం వల్ల ఇటీవల ఒడిశా దగ్గర ఎలాంటి ఘోర ప్రమాదం సంభవించిందో తెలియజేశారు. ఆ నష్టాన్ని ఎవరు పూడుస్తారని ఆమె ప్రశ్నించారు. అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద జరిగే ఉక్కు రక్షణ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఐదు వేల మంది గిరిజన, దళిత ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్లాంట్ ప్రైవేటుపరమైతే రిజర్వేషన్లు అమలుకావని అన్నారు. స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థల వల్లే విశాఖ అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ సభలో బైకుయాత్రకు నేతృత్వం వహిస్తున్న బి.జగన్ మాట్లాడుతూ యాత్రకు ఎక్కడికక్కడ అపూర్వ స్వాగతం లభిస్తోందన్నారు. యాత్ర ఆద్యంతం ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. అరకులోయలోని అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర, అనంతగిరి జెడ్పిటిసి డి.గంగరాజు, సిపిఎం నాయకులు భాస్కరరావు, సత్యనారాయణ, కృష్ణారావు, సోమన్న, మన్మథరావు, రామ్మోహన్‌రావు, వి.ఉమామహేశ్వరరావు, సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

కళారూపాలతో ఆకట్టుకున్న కళాకారులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, నిరుద్యోగ యువకులు

ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -సీలేరు

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20 నుంచి 29 వరకు చేపట్టిన ఉత్తరాంధ్ర బైక్ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సిపిఎం గాలికొండ ఎంపిటీసీ బుజ్జిబాబు ఆధ్వర్యాన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ రక్షించేందుకు కార్మికులు, వివిధ ప్రజాసంఘాలు గత వెయ్యి రోజులు పైబడి ఉద్యమాలు చేస్తున్న మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కార్మికుల పోరాటాలకు మద్దతుగా సిపిఎం ఈ బైక్ యాత్ర చేపట్టిందని చెప్పారు. 29న ముగింపు సందర్భంగా స్టీల్ ప్లాంట్ ముఖద్వారం వద్ద వేలాది మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందని, దాన్ని విజయవంతం చేయాలని బుజ్జిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మురళి, చంటిబాబు, రామారావు, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని వెనుకబడిన మండలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, వై.రామవరం, మారేడమిల్లి, గంగవరం మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, ఎటిడబ్ల్యూఓలు, ఎంఇఒలు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఐసిడిఎస్ సిడిపిఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు, వెలుగు ఏపీడి, ఏపిఎంలతో కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ గనోరే మాట్లాడుతూ బాగా వెనకబడిన మండలాల్లోని గ్రామాలలో ప్రజలకు వివిధ రకాలైన మౌలిక సదుపాయాలు కల్పనకు నివేదికలు తయారు చేసి ఇవ్వాలని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను ఆదేశించారు. నీతి అయోగ్ ద్వారా ఒక బ్లాక్ డెవలప్మెంట్‌ను ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలు అభివృద్ధికి ఎంపీడీవోలకు ఎపియస్ఆర్ఐడిటీ హైదరాబాదులో శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా నీతి అయోగ్ ఏర్పాటు చేయడం చేసినట్లు చెప్పారు. రంపచోడవరం డివిజన్లోని వై.రామవరం, మారేడుమిల్లి, గంగవరం మండలాలలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన సదుపాయాలపై లిఖితపూర్వకంగా జాబితా తయారు చేసి సమర్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గిరిజన విద్యార్థులకు క్వాలిటీ విద్యను అందించేందుకు, ఐసిడిఎస్ ద్వారా లబ్ధిదారులకు సౌకర్యాల కల్పనకు, ప్రతి ఇంటికి తాగునీటి సరఫరాకు, విద్యుత్ సమస్యలు పరిష్కారం తదితర వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్. జిల్లా శిక్షణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిడి రాంబాబు, ఎటిడబ్ల్యూఓ రామతులసి, ఎంఇఒలు తాతఅబ్బాయి దొర, బి.తమ్మారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్ర బాబు, ఏపీపీడీసీఎల్ ఇంజనీర్లు శ్రీనివాసరావు దొరబాబు, శ్రీనివాసరావు, ఎంపీడీవోలు జయంతి, శ్రీనివాస్, సిడిపిఓలు లక్ష్మీ ప్రసన్న, లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని రాయనిపేట పంచాయతీ పరిధి తుమ్మల నగర్ గ్రామ శివారులో ఈ నెల 10న కాలిపోయి గుర్తు పట్టని స్థితిలో లభ్యమైన మృతదేహానికి సంబంధించిన కేసును ఎటపాక పోలీసులు ఛేదించారు. ఈ మేరకు కేసు వివరాలను రంపచోడవరం ఎఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి సోమవారం ఎటపాక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎఎస్‌పి కథనం ప్రకారం... తెలంగాణా రాష్ట్రం భద్రాచలం పట్టణం మెడికల్ కాలనీలో నివాసముంటున్న పగిళ్ల దుర్గాప్రసాద్‌కి, అతని తల్లిదండ్రుల పగిళ్ల సావిత్రి, రాముకు మధ్య ఆస్తి విషయంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో కొడుకు దుర్గాప్రసాద్‌ని అడ్డు తొలగించుకొనేందుకు అతని తల్లిదండ్రులు పథకం వేశారు. ఇందులో భాగంగా దర్గాప్రసాద్‌ను హత్య చేసేందుకు భద్రాచలం పట్టణానికి చెందిన గుమ్మడి రాజు, షేక్ అలీపాషాతో మూడు లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నెల 9న రాత్రి 12 గంటల సమయంలో నిద్రపోతున్న దుర్గాప్రసాద్‌ని పగ్గిళ్ల సావిత్రి, పగిళ్ళ రాము, గుమ్మడి రాజు, అలీపాషా నలుగురూ కలిసి మరణాయుధంతో హత్య చేసి, మృతదేహాన్ని తుమ్మలనగర్ అటవీప్రాంతంలో పెట్రోల్ పోసి తగులపెట్టి పర్యారయ్యారు. ఈ కేసు విచారణలో భాగంగా పోలీసులు గాలింపు చర్యలు చెప్పట్టారు. సోమవారం ఉదయం ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం కుంట వైపు వెళ్లడానికి సిద్ధ పడుతుండగా పురుషోత్తపట్నం చెక్ పోస్ట్ వద్ద పోలీసులు చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుండి హత్యకు ఉపయోగించిన కత్తిని, మృతదేహాన్ని తరలించిన ఆటోను, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య కేసులో మృతుడి గుర్తింపు, ముద్దాయిలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన యటపాక సిఐ గజేంద్రకుమార్, ఎస్సై పార్థసారథి, ఇతర సిబ్బందిని అడిషనల్ ఎస్‌పి అభినందించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి మహేశ్వరరెడ్డి

తాగునీటి వెతలు

-మరమ్మతుకు నోచని పైపులైన్
-చేపట్టని జల జీవన్ పనులు
-ఊట గెడ్డల నీరే గిరిజనులకు ఆధారం

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో గిరిజనులకు తాగునీటి వెతలు తప్పడం లేదు. గత్యంతరం లేక ఊట, చెలమ నీటిని సేకరించి ఆశ్రయించవలసిన పరిస్థితి నెలకొంది. వేంగడ పంచాయతీ పరిధి డొంకపుట్టు, పెన్నంతి గ్రామాలలో దాహం కేకలతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా గ్రామాలకు గత ఆరేళ్ల క్రితం వెలుగు సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో ఆయా గ్రామాల గిరిజన ప్రజలు గత్యంతరం లేక గ్రామాలకు కొంత దూరంలో ఉన్న ఊట నీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాలకు జల జీవన్ పథకం కింద ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరు కాగా సంబంధిత అధికారులు నేటి వరకు పనులను ప్రారంభించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో గిరిజన ప్రజలు కలుషితమైన గెడ్డ నీటిని ఆశ్రయించి అనేక రోగులకు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పైపులైను మరమ్మత్తులు చేపట్టి మంజూరైన జల జీవన్ పథకం ద్వారా పనులు చేపటి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు మండలంలోని వేంగడ పంచాయతీ పరిధి డొంకపుట్టు, పెన్నంతి గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్ సివెరి. కొండలరావు డిమాండ్ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంచాయతీలో తాను అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మరమ్మతుకు గురు కావడంతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత్యంతరం లేక కలుషితమైన ఊట నీటిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెల కొందని, ఇప్పటికైనా అధికారులు మరమ్మతు చేపట్టాలని కోరారు. లేని పక్షాన గిరిజన ప్రజలతో మండల కేంద్రం వద్ద ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడ తామన్నారు.

గెడ్డలో నీటిని సేకరిస్తున్న మహిళలు

నిరుపయోగంగా కుళాయి

నీటిని మోసుకెళుతున్న మహిళలు

ప్రభుత్వ నిర్బంధకాండపై..

ఎగసిన అంగన్‌వాడీల ఆందోళనలు

- జిల్లా వ్యాప్తంగా నిరసనలు -
జగన్ సర్కారుపై మండిపాటు
- డిమాండ్లు నెరవేర్చే వరకూ పోరాడతామన్న నేతలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

అంగన్‌వాడీల చలో విజయవాడపై ప్రభుత్వ, పోలీసు నిర్బంధకాండను ఖండిస్తూ అల్లూరి జిల్లాలో ఎక్కడికక్కడ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్‌వాడీలు సోమవారం ఆందోళనలకు దిగారు. ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టారు. డిమాండ్లను నెరవేర్చే వరకూ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

పాడేరు : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాల్సిందేనని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసారంటూ మండిపడ్డారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే తమను బోలెడు సమస్యలు చుట్టుముట్టగా కొత్త కొత్త యాప్‌లు తీసుకొచ్చి మానసిక క్షోభకు గురిచేయడం దారుణమన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా కన్వీనర్ అమర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సహనాన్ని పరీక్షించవద్దని హితవు పలికారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అప్పలకొండ పడాల్, విజయ, చిన్నారి, పాడేరు డివిజన్‌లోని అన్ని మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స పాడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖండించారు.

అరకులోయ రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. అక్కడి నుంచి నాలుగు రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకోకు దిగారు. సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. అక్రమ అరెస్టులను ఖండించారు. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు. కనీస వేతనం, బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు జయ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దురియా నాగమ్మ, సిఐటియు అరకువేలీ మండల కార్యదర్శి జె.భగత్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : సిఐటియు మండల కార్యదర్శి కె.శంకరరావు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక కల్యాణ మండపం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుజాత, ఈశ్వరి, పద్మలత, భవాని, సత్యవతి, రాధ పాల్గొన్నారు.

విఆర్.పురం : అంగన్‌వాడీ సంఘం జిల్లా నాయకులు సున్నం రంగమ్మను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను సిఐటియు, సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ, రాజేశ్వరి, సోయం చిన్నబాబు, వి.రమేష్ పాల్గొన్నారు.

చింతూరు : అక్రమ అరెస్టులను ఖండిస్తూ స్థానికంగా వందలాది మంది అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, సీసం సురేష్ మాట్లాడారు. అంగన్‌వాడీలు గొంతెమ్మ కోరికలేమీ కోరలేదన్నారు. వారి డిమాండ్లను నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తుమ్మల ఎంపిటిసి రాజ్‌కుమార్, గోవింద్, శ్రీను, అంగన్వాడీలు వెంకట రమణ, దుర్గ, జయ, పొద్దమ్మ, వీరమ్మ, అన్నపూర్ణ, చుక్కమ్మ, నాగమణి, చిట్టెమ్మ, మణిశ్వరి పాల్గొన్నారు.

రంపచోడవరం : రంపచోడవరం, దేవిపట్నం మండలాల్లో నిరసనలు చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడారు. అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడుదల చేయాలన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం కన్నా దారుణంగా జగన్ సర్కారు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇతపల్లి సిరిమల్లిరెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు కొమరం చెల్లాయమ్మ, అంగన్‌వాడీ నాయకులు సుభద్ర, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

చింతూరులో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నేతలు, అంగన్వాడీ కార్యకర్తలు

అరకు కాఫీకి ప్రపంచ స్థాయిలో మార్కెటింగ్ : ఎంపీ

ప్రారంభిస్తున్న ఎంపీ మాధవి

ప్రజాశక్తి- పాడేరు :అరకు కాఫీ మార్కెటింగ్‌కు ప్రత్యేక వేదికగా నిలిచిందని పార్లమెంట్ సభ్యులు గొడ్డేటి మాధవి పేర్కొన్నారు. బెంగళూర్‌లో జరుగుతున్న ప్రపంచ కాఫీ సమావేశంలో ఐటిడిఎ, జిసిసి ఏర్పాటు చేసిన కాఫీ పెవిలియన్‌ను ఎంపి మాధవి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ, బెంగళూరు మహారాణి కోటలో ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల ప్రతినిధులు పాల్గొన్న వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్‌కు ఆంధ్రప్రదేశ్ నుండి పాడేరు ఐటిడిఎ, జిసిసి పాల్గొనడం శుభ పరిణామమని, అరకు కాఫీ ప్రపంచ వ్యాప్తంగా అందరికీ పరిచయం చేయటంతో పాటు కాఫీ మార్కెటింగ్‌కు విస్తత అవకాశాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అరకు కాఫీని ప్రపంచ స్థాయిలో మార్కెటింగ్ చేయాలని ఎంపి సూచించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేయటానికి ఈ వేదికను ఉపయోగించుకోవాలని, అల్లూరి జిల్లాలో కాఫీ పంటను విస్తత పరిచే దిశగా రైతులు ముందుకు వస్తే వారికి ప్రోత్సాహం అందిస్తామని ఆయన స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, జనరల్ మేనేజర్ యూస్తఫ్, కాఫీ డిడి రమేష్, ఎడి అశోక్, మాజీ మంత్రి మణికుమారి, చింతపల్లి మాక్స్ ప్రతినిధులు, సుమారు 150 మంది కాఫీ రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాత పింఛను పథకం (ఒపిఎస్) అమలు చేయాల్సిందేనని, గ్యారెంటీ పింఛను పథకం (జిపిఎస్)ను అంగీకరించేదే లేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సిపిఎస్ కు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తీసుకు వచ్చిన జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ, ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో), ఎపిఒపిఎస్ఇఎ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్‌ను నిర్వహించారు. కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ధర్నా నిర్వహించారు. ఒపిఎస్ అమల్లో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినదించారు. హామీ ఇచ్చింది ఒపిఎస్, మమ్మల్ని ముంచే జిపిఎస్ వద్దే వద్దంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. జిపిఎస్ ను ఎట్టి పరిస్థితులను అంగీకరించబోమని, ఒపిఎస్ సాధించుకునేం తవరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. లేకుంటే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొద్దిసేపు తర్వాత ఉద్యోగులను పోలీసులు గేటు లోపలకు పంపించారు. జిల్లా కలెక్టర్ అందుబాటులోకి లేకపోవడంతో డిఆర్ ఒకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్.జగన్ మోహన్ రావు, ముఖి శేషాద్రి, ఎం.రామకృష్ణ, వి.వెంకటరమణ, ఎం.ఈశ్వరరావు, గిడ్డి వరలక్ష్మీ, పోతురాజు, శేషగిరి, చిన్నారావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దీక్ష శిబిరం తొలగింపు

ఉద్యోగ, ఏజెన్సీ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులపై అధికారుల తీరును వ్యతిరేకిస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఏ కార్యాలయం ఎదుట ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆదివారం రాత్రి అధికారులు తొలగించారు. గత మూడు రోజులుగా ఉద్యోగులు ఇక్కడే దీక్షలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి టెంట్, ఫ్లెక్సీలు తొలగించారు. అధికారులు, పోలీసుల చర్యపై ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్తామని తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉద్యోగులు చేస్తున్న దీక్షను తొలగించడం అప్రజాస్వామికమని ఆదివాసి హక్కులు, చట్టాల పరిరక్షణ ఎపి జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర, రాష్ట్ర నాయకులు ఎస్.గంగరాజు తదితరులు ఖండించారు.

1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

- తహాశీల్దార్, ఎంపిడిఒలదే కీలక పాత్ర
- వాలంటీర్లు సేవలందించాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: అక్టోబర్ ఒకటవ తేదీ నుండి 45 రోజుల పాటు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రణాళికా బద్ధంగా, ఫక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇప్పటికే ఇంటింటి సర్వే జరుగు తోందన్నారు. ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. క్రానిక్ వ్యాధులైన కేన్సర్, గుండె పోటు, కిడ్నీ సమస్యలు వంటివాటిని గుర్తించి ఆయా మండలాలలో నిర్వహించే వైద్య శిబిరాలకు తరలించి స్పెషలిస్ట్ డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అందించాలని సూచించారు. అవసరమైతే ఉన్నత ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. అందుకు అవసరమయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేసారు.ఇందులో తహసిల్దార్లు, ఎంపిడిఓలు కీలక పాత్ర వహించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో వాలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రక్త హీనత, పౌష్టికాహార లోపంతో భాద పడేవారు ఎక్కువగా ఉన్నారని, వారిని గుర్తించి వైద్య శిభిరాలకు తరలించి చికిత్స అందించాలని కోరారు. ఇంటింటి సర్వే రెండు బృందాలుగా నిర్వహించాలని, ప్రతి ఇంటినీ తప్పని సరిగా కవర్ చేయాలని సూచించారు. వైద్య శిబిరాల నిర్వహణకు తగు స్థలం, సమయం గుర్తించి రెండు, మూడు రోజుల ముందుగా ఆయా గ్రామాలలో విస్తత ప్రచారం గావించాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య శిభిరం కేవలం వైద్య శాఖకు చెందినదిగా భావించవద్దని, ఇందులో స్త్రీ, శిశు సంక్షేమం, విద్యా శాఖలు కూడా పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలు, పాటశాలలలో బరువు తక్కువ, రక్త హీనత, ఎదుగుదల లోపం పిల్లలను గుర్తించి వారిని కూడా వైద్య శిభిరాలకు తరలించి చికిత్సలు అందించాలన్నారు. జిల్లా లో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలన్నారు. ఈనెల 26న మంగళవారం దిగువ మోదాపుట్టులో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిభిరాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద నిర్వహిస్తామన్నారు, తద్వారా లోపాలు, లోటు పాటులు తెలుసుకుని వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.ఈ వీడియో సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాష, రాష్ట్ర నోడల్ అధికారి రమేష్ బాబు, డిసిహెచ్ఎస్ కృష్ణారావు, టి.బి నియంత్రణాదికారి విశ్వేశ్వర నాయుడు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:పంచాయతీ సరిహద్దు గ్రామాల మధ్య ఏర్పడిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీపీ బి.ఈశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గసభ సిపిఎం సర్పంచ్ పి.సునీత మాట్లాడుతూ, గసభ పంచాయితీ లోగిలి, సాగర పంచాయతీ పొడ్డగుడ సరిహద్దు గ్రామాల మధ్య భూ సమస్య తీవ్ర తరమవుతుందన్నారు. దీనిపై అధికారులకు విన్నవించిన పరిష్కరించడంలో ఆలస్యం జరుగుతుండడంతో ఇరు పంచాయతీ గ్రామాల మధ్య వివాదం తలెత్తుతుందన్నారు. ఆ రెండు గ్రామాల మధ్య ఏర్పడిన భూ సమస్యపై రెవెన్యూ శాఖ, ఫారెస్ట్ శాఖ అధికారులు వేరువేరుగా మ్యాపులు చూపించడంతో గొడవలు మరింత తీవ్రతమవుతుందన్నారు. అధికారుల నుంచి సరైన పరిష్కార సమాధానం లేక లోగిలి గ్రామస్తులు సాగు చేసిన పంటలపై పొడ్డగుడ గ్రామస్తులు దాడులు చేసి పంటలను నాశనం చేశారని తహాసిల్దార్ నాగమ్మ దృష్టికి తీసుకువచ్చారు. అరుకు, కొర్ర పంచాయితీ గ్రామంలో మంజూరైన పట్టాలను వీఆర్వోలు పంపిణీ చేయలేదని, ఆ పట్టాల్లో కూడా ఫోటోలు వేరువేరుగా ఉన్నాయని ఆయా పంచాయతీ సర్పంచులు జి.శారద, అర్జున్ తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. గసభ, జంగిడి వలస, సిమ్లిగూడ గ్రామాల్లో, కంద్రుం పంచాయితీలో నాడు నేడు పథకంలో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాల నిర్మాణాలు నత్త నడకన సాగుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వాటిని త్వరితగతిన పూర్తిచేసే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గసభ పంచాయతీ సర్పంచ్ సునీత, కంద్రు సర్పంచ్, పంచాయతీ సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే హరి ఎంఈఓను నిలదీశారు. తాగునీరు డ్రైనేజీ, వీధి దీపావలు సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు అధికారం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, వైస్ ఎంపీపీలు ఎస్.ఆనంద్, పి.లలిత, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీవో ఉషారాణి, తహసిల్దార్ నాగమ్మ, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు

సమస్యలు తెలుపుతున్న సభ్యులు

గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ విజేతగా శృతి మనోజ్ఞ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) 16వ గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ విజేతలలో ఒకరైన విశాఖపట్నానికి చెందిన యువ కళాకారిణి శృతి మనోజ్ఞ వేమూరిని సంస్థ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ సత్కరించారు. 90 దేశాలు, ప్రాంతాల నుంచి 7,80,000 మంది పాల్గొన్న ఈ పోటీలో "టొయోటా టైమ్ ట్రాన్సిటర్" పేరుతో శృతి గీచిన చిత్రం ప్రత్యేకంగా నిలిచిందని ఆయన తెలిపారు. 12-15 సంవత్సరాల వయస్సు విభాగంలో 3000 అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీని ఆమె గెలుచుకుందని వివరించారు.

రంపచోడవరంలో దీక్షల్లో కూర్చున్న టిడిపి నాయకులు

కొనసాగుతున్న టిడిపి నేతల నిరసన దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

అనంతగిరి:మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం మండల కేంద్రం వద్ద అరకు నియోజకవర్గ మాజీ మంత్రి కిడారి శ్రావణ కుమార్ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో శ్రావణకుమార్ మాట్లాడుతూ, ఎటువంటి ఆధారాలు లేకుండా చంద్రబాబు పై కేసులు బనాయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ జిల్లా వైస్ చైర్పర్సన్ కె.అప్పారావు, మండల అధ్యక్షులు టి.బుజ్జిబాబు, పార్టీ మండల నాయకులు ఎస్.దొన్ను, జోగులు, లక్ష్మణ్ పాల్గొన్నారు

హుకుంపేట:మండలంలోని తాడిపట్టు పంచాయతీ గడుగుపల్లిలో బాబు షూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం మహిళలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించందని తెలిపారు. వైసిపి ఆరాచక పాలనపై ప్రజలు అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి సిరగం సూర్యకాంతం, తాడిపుట్టు గ్రామపంచాయతీ సర్పంచ్ సోమేలి సత్యవతి, మాజీ జడ్పిటిసి సాగర వసంతకుమారి, తెలుగు యువత మండల అధ్యక్షులు పల్టా సింగి కామేశ్వరరావు, యూనిట్ ఇన్చార్జి సోమేలి లక్ష్మయ్య, టిడిపి సీనియర్ నాయకులు సివేరి ఈశ్వరరావు, సాగర బొంజన్న, కిరసాని అప్పలకొండ పాల్గొన్నారు

రంపచోడవరం : చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యాన రంపచోడవరంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 13వ రోజుకు చేరాయి. మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబు రమేష్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పూలదండలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, జెఎస్.నగేష్, అడబాల బాపిరాజు, గొర్లే సునీత, ముచ్చు నాగేశ్వరరావు, పెంటపాటి అనంత మోహన్, మాగాపు బాబురావు, వై నిరంజని దేవి, తీగల ప్రభ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్.పురం : చింతూరులో టిడిపి చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరం విఆర్.పురం జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి , మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు సోమవారం దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇళ్ల చిన్నారెడ్డి, బురక కన్నారావు, వెంకటేశ్వర్లు, సురేష్ చౌదరి, అకోజు భాగ్యలక్ష్మి, ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, సవలం రాజేంద్రప్రసాద్, బీరక సూర్య ప్రకాష్ రావు, పాయం రామారావు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- అనంతగిరి: మండల అభివృద్ధికి తన వంతు ఎంతో కృషి చేస్తున్నానని మండల పరిషత్ అధ్యక్షురాలు శెట్టి. నీలవేణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పదవి చేపట్టి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం కేక్ కట్ చేశారు. పార్టీ కార్యకర్తలు మండల పరిషత్ సిబ్బందిలు ఎంపీపీని సన్మానించారు. అనంతరం ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో గ్రామాల అభివృద్ధికి రెండేళ్ల పాలనలో నిధులు కేటాయించి అభివృద్ధి చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, ఎంపీటీసీ అశోక్, ఇన్చార్జి ఎంపీడీవో ఏవివి. కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

కేక్ కట్ చేస్తున్న ఎంపిపి

విశాఖలో మత్స్య విశ్వ విద్యాలయం ఏర్పాటు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దేశంలో మూడో మత్స్య విశ్వవిద్యాలయాన్ని విశాఖ నగరంలో ఏర్పాటుచేస్తామని కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల చెప్పారు. లాసన్స్ బే కాలనీలోని బిజెపి కార్యాలయంలో సోమవారం జరిగిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొరుగు దేశాల్లో బందీలుగా ఉన్న 500 మంది మత్స్య కారులను విడిపించి దేశానికి తీసుకొచ్చామని తెలిపారు.

స్పందనకు 40 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న ఐటిడిఎ ఎపిఒ

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 40 అర్జీలు అందాయి. వాటిని ఐటీడీఏ ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. రంపచోడవరం మండలం కాకివాడ నుండి కొయ్యలగూడెం గ్రామం వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఈతపల్లి కాలువపై వంతెన నిర్మాణం చేయాలని, మారేడుమిల్లి మండలం కుత్రవాడ పంచాయతీలోని ఇలివాడ గ్రామంలో మంజూరైన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పనులు వెంటనే ప్రారంభించి నెట్ వర్క్ సౌకర్యం కల్పించాలని, మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడివలస పంచాయతీ పరిధిలో రద్దు చేసిన వివిధ రకాల పింఛన్లు, రేషన్ కార్డులను పునరుద్ధరించాలని తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్ శాస్త్రి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎండి.యూసఫ్, సుబ్బయ్య. పిఎఓ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

బహుమతులతో విజేతలు

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. హారతి మాట్లాడుతూ 1969 సెప్టెంబర్ 24న జాతీయ సేవా పథకం ప్రారంభించబడి నేటికి 54 సంవత్సరాలకు పైగా సామజిక సేవలో ఏంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిందని తెలిపారు. సామాజిక సేవా భావంతో విద్యార్థులు బాధ్యతగా మెలగాలని, విద్యార్థి దశనుంచే సేవాదృక్పదాన్ని అలవార్చుకోవాలని సూచించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయన్నారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి వెంకట్రావు, ముల్లిశేఖర్, కె శకుంతల, డాక్టర్ వై పద్మ, అప్పనమ్మ, కె శైలజ, శ్రీదేవి, సిహెచ్ రాజాబాబు, కె శ్రీలక్ష్మి, ఆర్ మౌనిక, పి గౌతమి, జి సాయికుమార్, పి ఏడుకొండలు, అలివేలు పాల్గొన్నారు.

ఆదివాసీ పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-చింతూరు : గిరిజన గ్రామాల్లోని ఆదివాసీ పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏవియస్‌పి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడి మురళి స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదిమ తెగల సంస్కృతి సంప్రదాయాలు భారత దేశానికే గర్వకారణమని, వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ఆదివాసీ పౌరూలదేనని స్పష్టం చేశారు. ఆదివాసి సంస్కృతి భాషా పరిరక్షణ ద్వారానే హక్కులు రక్షించబడతాయన్నారు. పోలవరం నిర్వాసితుల, సమస్యల పరిష్కారం కోసం, ఆదివాసీ మహిళా రక్షణ కోసం, కోయ తెగ, ధర్మాల రక్షణ కోసం ఆదివాసీ యువతి, యువకులకు ఉద్యోగ చట్టబద్ధత కోసం పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో సోడి సత్యనారాయణ, బాబు శ్రీను, కారం వెంకటేశ్వర్లు, అక్కిపాలి చందు, పాయం విద్య సాగర్, సోడి ప్రకాష్, కుర్సం వీరయ్య పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం నూతి బంధం నుంచి రైన్ గెజ్ వరకు ప్రధాన రహదారి నిర్మాణ పనులను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం పరిశీలించారు. నూతి బంధం నుంచి రైన్ గెజ్ వరకు 10 కిలోమీటర్లు ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నాలుగు కోట్ల 30 లక్షలు రూపాయలు కలెక్టర్ సుమిత్ కుమార్ మంజూరు చేశారు. ఈ మేరకు కాంట్రాక్టు జె.అర్జున్ రెడ్డికి పనులు అప్పగించారు. రహదారికి మెటల్ పనులు పూర్తి కావడంతో కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మితంగా సోమవారం తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే 78వ కిలోమీటర్ నుంచి 80వ కిలోమీటర్ రాయి వరకు సుమారు రెండు కిలోమీటర్లు మేర రహదారి బాగుండడంతో దాన్ని అలాగే ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పనుల్లో భాగంగా సుమారు 60 లక్షలు రూపాయలు మిగులుతుందని ఆర్ ఎం బి అధికారులు కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ సొమ్ముతో లంకపాకల వద్ద రెండు కిలోమీటర్లు రహదారి నిర్మాణం పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. నూతి బంధం నుంచి వెనక్కి జీకే వీధి వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉండటాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ స్వయంగా పరిశీలించారు. నూతన రహదారి నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఆర్ అండ్ బి ఈఈ పి. బాలసుందర బాబుకు ఆదేశించారు. బీటీ రోడ్డు పనులు వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి జెఇ భరతుడు, జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో మంచు సోయగాల కనువిందు

సీలేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ దారాలమ్మ అమ్మవారి ఘాట్ రోడ్లో మంచు సోయగాలు సోమవారం ఉదయం 10 గంటలకు రైన్గేజ్ వద్ద పర్యాటకులు మనసులను దోచుకున్నాయి. వాతావరణంలో ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ రూపాల్లో ప్రధాన రహదారి సమీపంలో మంచు అందాలు ఆవిష్కృతమై దర్శనమిస్తూ చూపురులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ప్రతి ఏటా శీతాకాలంలో మంచు అందాలు కనువిందు చేయగా, ఈ ఏడాది ముందస్తుగానే ఆవిష్కృతమవుతున్నాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మంచు మేఘాలు పచ్చని ఎత్తైన కొండలను కమ్మేస్తుండడంతో ఆ దృశ్యాలను తిలకించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. దారకొండ ఘాట్ రోడ్ల ప్రధాన రహదారి సమీపంలో ఉన్న రైన్ గెజ్ వద్ద పర్యాటకలు సేదతీరే వసతి భవనాలు ఏర్పాటు చేసి పర్యాటకశాఖ అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని పలువురు కోరుతున్నారు.

సర్క్యులర్ స్టాటిస్టిక్స్‌పై గీతం జాతీయ వర్క్‌షాప్

సదస్సును ప్రారంభిస్తున్న గీతం విసి దయానంద

ప్రజాశక్తి- మధురవాడ : ప్రముఖ గణాంక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సిఆర్.రావు స్మారకంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం సర్క్యులర్ స్టాటిస్టిక్స్, బిగ్‌డేటా రంగాలలో నూతన ఆవిష్కరణలపై జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం పాల్గొని, గణిత, గణాంక శాస్త్రాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. భారతీయులు గణితశాస్త్రంతో పాటు గణాంకశాస్త్రంలో అత్యున్నత పరిశోధనలు జరిపారని ప్రొఫెసర్ సిఆర్.రావు వంటి వారు ఆధునిక శాస్త్రాలతో గణాంక శాస్త్రాన్ని కలిపి అద్భుత ఫలితాలు సాధించి ప్రపంచానికి మార్గం చూపారని కొనియాడారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, గణితశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ శిరీష, నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ ఎ.శ్రీదర్, డాక్టర్ జోగారావు, డాక్టర్ అరుణకుమారి పాల్గొన్నారు.

అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.రావు జమ్మలమడక కీలక ఉపన్యాసం చేయగా వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్‌లుగా హజరైన ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు 'డేటా మైనింగ్ అండ్ బిగ్‌డేటా' అనే అంశంపై మాట్లాడారు. సి.ఎస్.ఐ.ఆర్.శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఆశిష్‌సేన్ గుప్తా సర్క్యులర్ స్టాటిస్టిక్స్ ప్రయోజనాలను వివరించారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగం అధిపతి డాక్టర్ వి.ఎస్.విద్యానాధన్, డాక్టర్ విష్ణువర్ధన్‌లు అప్లైడ్ స్టాటిస్టిక్స్ ఉపకరణాలను వివరించారు. ఈ వర్క్‌షాప్‌నకు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి గణిత, గణాంక శాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ముల్లూరు గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకమ్మ

ప్రజాశక్తి -కూనవరం :మండలంలోని ముల్లూరు గ్రామాన్ని పోలవరం ప్రాజెక్టు ముంపు జాబితాలో చేర్చాలని ఆ గ్రామ సర్పంచ్ బొగ్గా వెంకమ్మ డిమాండ్ చేశారు. సిపిఎం ముల్లూరు శాఖ సమావేశం పైదా రామయ్య అధ్యక్షతన సోమవారం గ్రామంలో జరిగింది. ఈ సమావేశంలో వెంకమ్మ మాట్లాడుతూ 2022 వరదల సమయంలో ముల్లూరు గ్రామం మొత్తం ముంపునకు గురై నిరుపేద ప్రజలు కట్టు బట్టలతో అడవుల పాలయ్యారని తెలిపారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించిన పిఒ ఆకుల వెంకటరమణ, స్థానిక ఎమ్మెల్యే ఎన్.ధనలక్ష్మి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిర్వాసిత గ్రామంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాలం గడుస్తున్నా ఆ హామీ అమలు కాలేదన్నారు. నిర్వాసితులకు రూ.1,15,000 ఇచ్చిన భూములకు రూ.5 లక్షలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా రైతులకు పరిహారం ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముల్లూరు గ్రామం పోలవరం జాబితాలో లేనప్పుడు ఎందుకు ఇళ్ల సర్వే చేశారని ప్రశ్నించారు. వెంటనే పోలవరం జాబితాలో గ్రామాన్ని కలపాలని, లేకుంటే పునరావాసం ఇచ్చేవరకు పోరాడటం ఆపేది లేదని హెచ్చరించారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, మహిళా సంఘం నాయకురాలు కుంజా రాధా, శాఖ కార్యదర్శి శీలం పిచ్చయ్య, సోడా శ్రీరాములు,పైథా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కి ఎంపికైనట్లు ఆ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కె.భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్ షిప్‌కు ఎంపిక కాబడిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఫీట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కెవివి సత్యనారాయణ దొర, ప్రధానోపాధ్యాయులు బి తమ్మారావు, ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయిని కే భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ, ఆయా పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం జి.మాడుగుల సిడిపిఓ జి.సువర్ణమ్మ, కొయ్యూరు సీనియర్ అసిస్టెంట్ కెవి ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 10 గంటలకు పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-అడ్డతీగల: మండలంలోని భీముడుపాకుల పంచాయతీ పింజరికొండ గ్రామం సమీపంలో ఏలేరు వాగులో ఆదివారం సాయంత్రం గల్లంతైన వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ఏలేరు వాగులో వ్యక్తి గల్లంతయినట్లు గ్రామస్తులు సమాచారం ఇవ్వగా, అడ్డతీగల ఎస్సై అప్పలరాజు వారి సిబ్బంది ఏలేరు వాగు ఒడ్డున గాలింపు చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని వెతికి తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అప్పలరాజు వివరాలు వెల్లడించారు. కోరుకొండ మండలం, కోటి కేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.భద్ర వెంకట శివరామకృష్ణ (52) వారి స్నేహితుడు మడేరు వాగులో రాయి వద్ద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఈ సమయంలో ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఒక్కసారిగా వాగు ఉధృతంగా రావడంతో నీటి ప్రవాహంలో శివరామకృష్ణ కొట్టుకుపోయాడు. దీనిని గ్రామస్తులకు తెలియజేయగా, పోలీసులు సోమవారం ఉదయం నుండి గాలించగా మృతదేహం లభ్యమైంది. అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో శవపంచినామా పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలరాజు, కానిస్టేబుల్ రాంబాబు, మూర్తి పాల్గొన్నారు.